కార్యకర్తలను విస్మరిస్తే పార్టీకి నష్టం

రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్


ప్రసంగిస్తున్న రాజనర్సింహ

జోగిపేట న్యూస్‌టుడే: కార్యకర్తలను విస్మరిస్తే పార్టీకి నష్టం కలుగుతుందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. చౌటకూరు మండలం తాడ్దాన్‌పల్లి శివారులోని కల్యాణ మండపంలో కాంగ్రెస్ తరపున ఏర్పాటు చేసిన అలయ్-బలయ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీచేసే వారందరినీ గెలిపించాలని కోరారు.

కబ్జాదారులను వదిలే ప్రసక్తే లేదు: భూములు కబ్జాలు చేస్తున్న వారిని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలకు ఉండవన్నారు. రాష్ట్రంలో కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని మంత్రి స్పష్టం చేశారు.

వారం రోజుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన: అందోలు నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాలకు మంజూరైన అభివృద్ధి పనులకు వారం రోజుల్లో శంకుస్థాపనలు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. అందోలులో రూ.40 కోట్లతో నర్సింగ్ కళాశాల, రూ.60 కోట్లతో 150 పడకల ఆసుపత్రి భవన నిర్మాణం, సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో రూ.15 కోట్లతో జిల్లా సైన్స్ సెంటర్ తదితర పనులను వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంజయ్య, మాజీ అధ్యక్షుడు అనంత్‌కిషన్, అందోలు-జోగిపేట పురాధ్యక్షుడు మల్లయ్య, ఉపాధ్యక్షుడు డేవిడ్, కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, హరికిషన్‌గౌడ్, చందర్, నాయకులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి


సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో పత్తి తీత ఆరంభమయిందని, త్వరగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పి.నర్సింహారెడ్డి కోరారు. సోమవారం ఆయన కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతి పత్రం అందజేశారు. రైతులకు ఇబ్బంది లేకుండా వెంటనే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఆరంభించాలని విన్నవించారు.

మన చేతుల్లోనే ఆరోగ్యం



● సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక మొదలు ఐదో తరగతి వరకు 94 మంది చదువుతున్నారు. నిత్యం ఉదయాన్నే ప్రార్థన సమయంలో చేతుల శుభ్రతపై ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. ద్రావణాన్ని అందుబాటులో ఉంచుతున్నారు. ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు. పిల్లల ఆరోగ్యానికి ఇలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని హెచ్ఎం సయ్యద్ సంధాని చెబుతున్నారు. వంట నిర్వాహకుల విషయంలోనూ ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు.

చేతుల శుభ్రతపై వివిధ వర్గాలకు చెందిన 200 మందితో 'న్యూస్‌టుడే' బృందం సర్వే నిర్వహించగా ఇలా స్పందించారు.



న్యూస్‌టుడే, సిద్దిపేట, సంగారెడ్డి అర్బన్

జిల్లాలో ఇలా..
- జనాభా: 14.12 లక్షలు
- అన్ని రకాల విద్యాలయాలు (1-10వ తరగతి వరకు): 1820
- విద్యార్థులు: 2.50 లక్షలు

ఆరోగ్యమే మహాభాగ్యం. ఇందుకు ప్రతీ అంశం కీలకమే. దినచర్యలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే.. సురక్షిత జీవనం సొంతం అవుతుంది. చేతుల శుభ్రత అత్యంత ప్రాధాన్యంతో కూడుకుంది. ఇటీవల ఆరోగ్య స్పృహ పెరిగినా.. విద్యాలయాల్లో కచ్చితంగా అమలు చేయాల్సి ఉంది. నేడు ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కె.స్నేహ జీగీష ఇలా వివరించారు.



అపరిశుభ్రతతో.. అనారోగ్యానికి కారణం. చిన్నారుల్లో అవగాహన లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఒకప్పటితో పోలిస్తే కొంత మార్పు కనిపిస్తోంది. విద్యాసంస్థల్లో మాత్రం భిన్నమైన పరిస్థితి నెలకొంది. అత్యధిక చోట్ల నీటి వసతి ఉన్నా సబ్బు లేదా ద్రావణాలు ఉంచడం లేదు. మధ్యాహ్న భోజనం, స్నాక్స్ తినే ముందు, ఆడినప్పుడు, శౌచాలయానికి వెళ్లినప్పుడు మామూలుగా శుభ్రం చేసుకుంటున్నారు. విద్యాసంస్థల నిర్వాహకులు దీనిపై శ్రద్ధ వహించాలి. గ్రామాల్లో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి.


బక్రిచెప్యాల ప్రాథమిక పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ సంధాని

ఇలా చేద్దాం..

● భోజనానికి ముందు చేతుల శుభ్రత తప్పనిసరి. ఒక నిమిషం ఇందుకు కేటాయించాలి. ● దగ్గినా, తుమ్మినా విస్మరించొద్దు. ● మల, మూత్ర విసర్జన తర్వాత కాళ్లు, చేతులు కడుక్కోవాలి. ● పాఠశాలల్లో ద్రావణం లేదా సబ్బును అందుబాటులో ఉంచాలి. ● ఉంగరాలు పెట్టుకునే చేతి వేళ్లను ఎక్కువ శుభ్రం చేయాలి. ● వైరస్, బ్యాక్టీరియాలు ఒంట్లోకి చేరేందుకు చేతులే వాహకాలు. కళ్లు, ముక్కు, నోటిని తరచూ చేతులతో తాకే ప్రయత్నం చేయొద్దు. ● చేతుల శుభ్రత అలవాటుగా మారితే అనారోగ్య సమస్యల నుంచి 90 శాతం భద్రంగా ఉన్నట్టే.

బాధ్యత వహిస్తే..

సబ్బు లేదా ద్రావణంతో చేతుల శుభ్రతతో అతిసారం 30 శాతం, శ్వాసకోశ వ్యాధులను 20 శాతం వరకు నివారించవచ్చు. కలరా, ఎబోలా, హెపటైటిస్-ఈ తదితర వాటి కారకాల వ్యాప్తిని అడ్డుకోవచ్చు. కడగకుండా అల్పాహారం, ఆహారం తీసుకుంటే హానికర క్రిములు పొట్టలో చేరే అవకాశం మెండు. కొన్ని సందర్భాల్లో టైఫాయిడ్, కడుపునొప్పి, విరేచనాల బారిన పడుతుంటారు. తల్లిదండ్రులు బాధ్యతగా బాల్యంలోనే అవగాహన కల్పించాలి.

చైతన్యం తీసుకొస్తూ..



తెల్లాపూర్ జడ్పీ పాఠశాల చేతుల పరిశుభ్రతలో ఆదర్శంగా నిలుసుంది. ఇక్కడి ప్రధానోపాధ్యాయులు భాస్కర్ ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఇక్కడ 520 మంది విద్యార్థులు చదువుతున్నారు. నిత్యం మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో సబ్బుతో విద్యార్థులు చేతులు కడుక్కోవడం తప్పనిసరి. శుభ్రతతో కలిగే ప్రయోజనాలను ఉపాధ్యాయులు తరచూ వివరిస్తున్నారు. ఇంటి వద్ద కూడా తప్పనిసరిగా పాటించాలని సూచిస్తున్నారు. జిల్లా స్థాయిలో పాఠశాలకు ఈ అంశంలో ప్రత్యేక గుర్తింపు దక్కింది. – న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ

ఉరుములు మెరుపులతో వర్షం


పస్తాపూర్ సమీపంలో రోడ్డుపై తెగిపడిన విద్యుత్తు తీగలు

సంగారెడ్డి అర్బన్, సదాశివపేట, జహీరాబాద్ అర్బన్, జిన్నారం, వట్‌పల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. అత్యధికంగా సదాశివపేటలో 24.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రజలు ఇబ్బందిపడ్డారు. అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్‌లో 22.3 మి.మీ., పటాన్‌చెరులో 21.5 మి.మీ., హత్నూర మండలం గుండ్లమాచనూర్‌లో 20.0 మి.మీ., పుల్కల్‌లో 18.5 మి.మీ. వర్షపాతం నమోదయింది. జహీరాబాద్ మండలం పస్తాపూర్ సమీపంలో ఈదురుగాలులకు విద్యుత్తు తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి. జహీరాబాద్-కప్పాడ్ మార్గంలో కాసేపు రాకపోకలు నిలిచిపోయాయి. వెంటనే విద్యుత్తు అధికారులు సమస్య పరిష్కరించడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. జిన్నారం మండలంలోని పారిశ్రామికవాడల్లో రహదారులు జలమయమయ్యాయి. వట్‌పల్లి మండలం మర్వెల్లిలో పిడుగుపాటుకు రైతు సంగప్పకు చెందిన ఎద్దు మృత్యువాతపడింది.

పిడుగుపాటుకు యువ రైతు మృతి


రవి

సిర్గాపూర్, కల్హేర్, న్యూస్‌టుడే: పశువులకు మేత తేవడానికి వెళ్లిన రైతు పిడుగుపడి మృతిచెందాడు. కల్హేర్ మండలంలోని బీబీపేట్‌లో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు.. బీబీపేటకు చెందిన సంగెం రవి(25) రోజు మాదిరిగానే పశువులకు మేత తేవడానికి వెళ్లాడు. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. యువరైతుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రవికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఉద్యమంలో అలయ్-బలయ్ తెలంగాణను ఏకం చేసింది



మాట్లాడుతున్న హరీశ్‌రావు

మాజీ మంత్రి హరీశ్‌రావు

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: అలయ్-బలయ్, ధూంధాం కార్యక్రమాలు తెలంగాణ ఉద్యమంలో ప్రజలను ఏకం చేశాయని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. అందోలు మండలం సంగుపేటలో మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అలయ్-బలయ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారాస ప్రభుత్వ హయాంలో రైతుబంధు ఏడాదికి పదివేల రూపాయలిస్తే, పదిహేను వేల రూపాయలిస్తామని కాంగ్రెస్ ప్రచారం చేసిందని, ప్రస్తుతం పదివేల రూపాయలిచ్చే పరిస్థితిలోనూ ఆ ప్రభుత్వం లేదని ఎద్దేవా చేశారు. పేదల కడుపు నింపడమే మాజీ సీఎం కేసీఆర్ అజెండా అని, వారి కడుపు కొట్టడమే కాంగ్రెస్ అజెండాగా మారిందని విమర్శించారు. నారాయణఖేడ్ ప్రాంతంలో పండుగపూట తాగునీరు అందక, కలుషిత బావి నీటిని తాగి ఇద్దరు మృతి చెందగా, ఎంతో మంది ఆసుపత్రి పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీపై తేదీలు పొడిగించుకుంటూ పోతున్నారని దుయ్యబట్టారు. దీనిపై వ్యవసాయ శాఖ మంత్రి 2024 డిసెంబరు9 అంటూ మళ్లీ కొత్త తేదీ చెప్పారని ఎద్దేవా చేశారు. శాసనమండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ శివకుమార్, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ మంజుశ్రీ, దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వినతులు అందజేసి.. పరిష్కారానికి అభ్యర్థించి..


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలంటూ వివిధ గ్రామాలకు చెందిన పలువురు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. అధికారులకు వినతులు అందజేసి పరిష్కారానికి అభ్యర్థించారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మజారాణి, ఆయా శాఖల అధికారులు అర్జీలు స్వీకరించారు. ప్రజావాణిలో భాగంగా అందిన దరఖాస్తులకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని కోరారు. నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు.

● అధికారుల తప్పిదం కారణంగా 10 గుంటలకు బదులు మూడు గుంటల భూమి మాత్రమే పాసు పుస్తకంలో నమోదయిందని, విచారించి న్యాయం చేయాలని సంగారెడ్డి మండలం కొత్లాపూర్‌కు చెందిన పద్మయ్య విజ్ఞప్తి చేశారు.

● దామగుండం అడవుల్లో నేవీ రాడార్ ప్రాజెక్టు వద్దంటూ సంగారెడ్డి పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త శ్రీధర్ వినతిపత్రం అందజేశారు.

● ఆర్థిక ఇబ్బందుల కారణంగా బీఎస్సీ నర్సింగ్ కోర్సులో చేరలేని పరిస్థితి ఉందని, అధికారులు స్పందించి సీటు ఇప్పించాలని సంగారెడ్డి పట్టణానికి చెందిన స్పందన విజ్ఞప్తి చేశారు.

● కొండాపూర్ మండలం గంగారం గ్రామానికి చెందిన కోళ్ల లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, బల్వంత్‌రెడ్డిల పాసుపుస్తకాల సమస్య నాలుగేళ్లకు పరిష్కారమయింది. సోమవారం కలెక్టర్ వీరికి పంపిణీ చేశారు.

నేడు డీఎస్సీ అభ్యర్థులకు కౌన్సెలింగ్

సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లాలో డీఎస్సీ-2024కు 1:1 కింద ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్, సెంకండరీ గ్రేడ్ టీచర్లు, భాషా పండితులు, వ్యాయామోపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ఉదయం 10 గంటలకు జడ్పీ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు.

పట్టణాలను అభివృద్ధి చేస్తాం: ఎంపీ


వినతిపత్రం స్వీకరిస్తున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: మెదక్ పార్లమెంట్ స్థానం పరిధిలోని పట్టణాలను అభివృద్ధి చేయటమే లక్ష్యమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. సోమవారం సంగారెడ్డిలోని ఐబీలో పురపాలికల ఛైర్మన్లు, కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాల్లో జనాభా పెరుగుతున్నా.. అవసరాలకు సరిపడా మురుగు కాల్వలు విస్తరించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ పథకంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థను బాగు చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని కోరారు. మంచినీటి సమస్య పరిష్కరించేందుకు కేంద్రం రూ.250కోట్లు మంజూరు చేసిందన్నారు. భాజపా జిల్లా అధ్యక్షురాలు సి.గోదావరి, రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లోనూ జనరిక్ ఔషధ దుకాణాలు

ఏర్పాటుకు మహిళా సంఘాలకు అవకాశం



న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్: రెక్కాడితేనే డొక్క నిండని నిరుపేద కుటుంబాలు జిల్లాలో ఇప్పటికీ ఉన్నాయి. ఇలాంటి కుటుంబాల్లో ఎవరైనా అనారోగ్యం బారిన పడితే ఆర్థికంగా ఎదురయ్యే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. చికిత్సకోసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లినా మందులు(ఔషధాలు) ఎక్కువగా బయటే కొనాల్సి ఉంటోంది. ఇలాంటి పేదలకు తక్కువ ధరకే ఔషధాలు అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. మహిళా సంఘాల ఆధ్వర్యంలోనూ జనరిక్ మందుల దుకాణాలకు స్త్రీనిధి రుణాలు అందిస్తోంది.

- జిల్లాలో మహిళా సంఘాలు: 18,208
- వాటిలో సభ్యులు: 1.91 లక్షలు
- ఈ ఏడాది స్త్రీనిధి రుణ లక్ష్యం: రూ.137.80 కోట్లు
- ఇప్పటి వరకు పంపిణీ: రూ.40.86 కోట్లు
- పంపిణీ శాతం: 29.65

రూ.3 లక్షల రుణం: జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు జనరిక్ ఔషధాలను అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా యంత్రాంగం ముందుకుసాగుతోంది. మహిళా సంఘాల సభ్యుల్లో అర్హులకు దుకాణాల ఏర్పాటుకు స్త్రీనిధి రుణాలను ఇచ్చి ప్రోత్సహించాలని నిర్ణయించారు. ఒక్కో దుకాణం ఏర్పాటుకు రూ.3లక్షల రుణం అందించనున్నారు. నారాయణఖేడ్, సంగారెడ్డి, పటాన్‌చెరు తదితర ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదలను సిద్ధం చేశారు.

మంజూరు ఇలా..

● స్వయం సహాయక సంఘాల్లో సభ్యురాలై ఉండాలి. వారి కుటుంబం, దగ్గరి బంధువుల్లో ఎవరైనా డీఫార్మసీ, బీ ఫార్మసీ, ఎంఫార్మసీ విద్యార్హత కలిగి ఉండాలి.

● రుణం పొందడానికి సభ్యురాలి సంఘం తీర్మానం తప్పనిసరి.

● ఔషధ దుకాణం కోసం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ధ్రువీకరణపత్రం, కొటేషన్, విద్యార్హత ధ్రువపత్రాలతో స్త్రీనిధి అధికారులకు దరఖాస్తు చేయాలి. వారు అర్హులుగా భావిస్తే వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు.

● ప్రతినెలా వాయిదాల రూపంలో ఐదేళ్లలోపు రుణం మొత్తం తిరిగి చెల్లించాలి.

సద్వినియోగం చేసుకోవాలి

జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు స్త్రీనిధి ద్వారా తక్కువ వడ్డీకే ఇస్తున్న రుణాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి. కుటుంబంలో ఎవరైనా దుకాణం ఏర్పాటుకు అవసరమైన విద్యార్హత కలిగి ఉంటే దరఖాస్తు చేసుకోవాలి. సులభ వాయిదాల పద్ధతిలో రుణాన్ని తిరిగి చెల్లించే వెసులుబాటు ఉంటుంది.

–శ్రీనాథ్, స్త్రీనిధి ప్రాంతీయ మేనేజర్.

కలుషిత తాగునీరు.. కారకులు మీరంటే.. మీరు!


గ్రామంలో పర్యటిస్తున్న ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటలో కలుషిత నీటిని తాగి ఇద్దరు మృతిచెందగా.. పలువురు అస్వస్థతకు గురైన విషయం విదితమే. సోమవారం ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటన చేపట్టగా.. కలుషిత నీటి సరఫరాకు కారకులు మీరంటే.. మీరని.. భారాస, కాంగ్రెస్ శ్రేణులు వాగ్వాదానికి దిగాయి. పోలీసులు అక్కడికి చేరుకొని నాయకులకు సర్దిచెప్పి శాంతింపజేశారు. ఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారిని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ వేర్వేరుగా పరామర్శించారు. ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్ ఇతర అధికారులతో కలిసి సంజీవన్‌రావుపేటలో పర్యటించారు. గ్రామస్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా పైపులైన్లు వేయడం వల్లే ప్రస్తుతం ప్రజలు ఇబ్బందిపడుతున్నారని ఖేడ్ ఎమ్మెల్యే ఆరోపించారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పాతట్యాంకు ద్వారా 120 ఇళ్లకు తాగునీటిని సరఫరా చేయగా 25 మంది అస్వస్థతకు గురయ్యారన్నారు. వారి ఆరోగ్య పరిస్థితి బాగుందన్నారు. ఇద్దరు మృతిచెందిన విషయంలో ఆరోగ్య సమస్యలు కారణమని తెలుస్తోందన్నారు. విచారణ జరుపుతామని పేర్కొన్నారు.

జాతీయ రహదారి విస్తరణ సరే.. సూచికలేవి?



సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లి శివారు నుంచి ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారి పనులు కొన్ని నెలలుగా కొనసాగుతున్నాయి. ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎలాంటి సూచికలు లేకుండా పనులు చేస్తున్నారని, ఇకనైనా ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్.

ధాన్యం నిల్వకు చిక్కులే!

జిల్లాలో ఇప్పటికే నిండి ఉన్న గోదాములు

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సదాశివపేట


సదాశివపేటలో గోదాము

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన సన్న ధాన్యాన్ని ఈసారి మిల్లులకు కేటాయించవద్దని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. జిల్లాలోని ప్రభుత్వ గోదాములకు తరలించాలని సూచించింది. ప్రస్తుత ఖరీఫ్ సాగుకు సంబంధించి 2,11,111 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని జిల్లా పౌరసరఫరాల సంస్థ అంచనా వేసింది. ఇందులో సన్నరకం ధాన్యం 86,334 మెట్రిక్ టన్నుల వరకు ఉండవచ్చని భావిస్తోంది. జిల్లాలోని గోదాములు ఇప్పటికే నిండి ఉన్నందున కొద్దిరోజుల్లో కొనుగోలు చేసే ధాన్యాన్ని ఎక్కడ నిల్వ చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

● జిల్లాలో
- వ్యవసాయ మార్కెట్లు: 8
- మొత్తం గోదాములు: 36
- నాబార్డుకు చెందినవి: 22
- వాటి సామర్థ్యం: 70వేల మెట్రిక్ టన్నులు
- ప్రస్తుతం నిండి ఉన్నవి: 20
- ఖాళీగా ఉన్నవి: 2
- నాన్ నాబార్డు పరిధిలో గోదాములు: 14
- వాటి సామర్థ్యం: 20,432 మెట్రిక్ టన్నులు
- ప్రస్తుతం నిండి ఉన్నవి: 11
- ఖాళీగా ఉన్నవి: 3

మిల్లర్ల సమస్యలే ప్రధాన కారణం

జిల్లావ్యాప్తంగా 69 రైస్ మిల్లులున్నాయి. వాటిలో 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే సామర్థ్యం ఉంది. ఒక్కో మిల్లులో 3 వేల నుంచి 4వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేయవచ్చు. సన్నధాన్యం మిల్లింగ్‌లో నూక ఎక్కువగా వస్తోందని, తేమ శాతం నిబంధనలను 17 నుంచి 14 శాతానికి తగ్గించాలని కోరుతున్నారు. క్వింటాకు రూ.300 పరిహారం, కస్టోడియన్ మిల్లింగ్, రవాణా ఛార్జీలు పెంచాలని వారంతా డిమాండ్ చేస్తున్నారు. దీంతో ప్రస్తుతానికి మిల్లర్లకు ధాన్యం కేటాయించవద్దని సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో ఎన్ని గోదాములు నిండి ఉన్నాయి? ఎక్కడ ఖాళీగా ఉన్నాయి? ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎలా చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పొరుగు జిల్లాల్లో అన్వేషణ

ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా పౌరసరఫరాల శాఖ అప్రమత్తమయింది. జిల్లాలోని గోదాముల్లో ధాన్యం, జొన్నలు, కందులు, పత్తి, మినుములు, పెసర, బియ్యం తదితరాలు నిండి ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా కేవలం అయిదు గోదాములు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. వాటి సామర్థ్యం కేవలం 7900 మెట్రిక్ టన్నులు మాత్రమే. దీంతో పొరుగు జిల్లాల్లో గోదాములు ఖాళీగా ఉంటే వినియోగించుకోవాలని జిల్లా అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు వివరాలు సేకరిస్తున్నారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ల సూచనలు పాటిస్తూ.. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని సివిల్ సప్లయ్ విభాగం డీఎం కొండల్‌రావు తెలిపారు.

రూ.98 లక్షలు వ్యయం.. మరమ్మతులకు నిర్లక్ష్యం



సంగారెడ్డి మున్సిపల్ అధికారులు రూ.98 లక్షలు వెచ్చించి గతేడాది కొత్త స్వీపింగ్ యంత్రాన్ని కొనుగోలు చేశారు. కొన్ని నెలల నుంచి ఆ యంత్రం పనిచేయడం లేదని పక్కకు పెట్టేశారు. కొద్దిపాటి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఈ విషయమై డీఈఈ ఇంతియాజ్ అహ్మద్‌ను అడగగా.. మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. –న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ.

అంబేడ్కర్ దీక్షా దివస్

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: స్థానిక అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో అంబేడ్కర్ దీక్షా దివస్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. బుద్ధుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. స్టడీ సర్కిల్ డైరెక్టర్ రామారావు మాట్లాడుతూ.. బుద్ధుడి బోధనలు ప్రతిఒక్కరు ఆచరించాలని సూచించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, కార్యదర్శి ప్రవీణ్, స్టడీ సర్కిల్ సభ్యులు దుర్గయ్య, బక్కన్న తదితరులు పాల్గొన్నారు.

తరుణీ.. శక్తిస్వరూపిణి



గ్రామీణ మగువ.. కొంగు నడుముకు బిగించి పొలంలో పంట పండించి రైతుగా అన్నం పెడుతోంది. . ఉపాధి హామీ పథకంలో స్వేదాన్ని చిందించి గ్రామీణ వలసల నివారణకు చోదకశక్తిగా నిలుస్తోంది. . పొదుపు ఉద్యమానికి హారతి పడుతోంది.. రుణాలతో స్వయం ఉపాధికి బాటలు వేసుకొని ఆర్థిక స్వావలంబనకు ప్రతీకగా నిలుస్తోంది.. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన గ్రామీణ మహిళలు నేడు శక్తిగా మారి అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తుండటం విశేషం. నేడు 'అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం' నేపథ్యంలో ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో సమస్యలు అధిగమించి విజయాలు సాధించిన వారిపై 'న్యూస్‌టుడే' కథనం.

నేడు ప్రపంచ గ్రామీణ మహిళా దినోత్సవం

జిల్లా	మహిళలు (లక్షల్లో..)	పొదుపు సంఘాలు	సభ్యులు (లక్షల్లో..)
సంగారెడ్డి	4.90	18,208	1.91
సిద్దిపేట	4.47	18,274	1.94
వికారాబాద్	4.26	15,525	1.62
మెదక్	3.88	13,061	1.37

- న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్, సిద్దిపేట, మెదక్, వికారాబాద్ కలెక్టరేట్

ప్రధాని నుంచి సత్కారం

వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం హస్నాబాద్‌కు చెందిన కంతి లక్ష్మి జాతీయస్థాయిలో ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలిగా ఎంపికై గ్రామీణ మహిళ ఎందరికో తక్కువ కాదని నిరూపించారు. జనవరి 26న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. పారిశుద్ధ్య కార్మికురాలిగా గ్రామం స్వచ్ఛంగా ఉంచడంలో కీలకపాత్ర పోషించారు. ఈమె చిత్తశుద్ధిని గమనించిన అధికారులు ఆమెను ఎంపిక చేశారు. ఈమె భర్త కంతి సైదప్ప. వీరికి ఎకరం పొలం ఉంది. మూడేళ్ల క్రితం భర్త అనారోగ్యం పాలవడంతో ఆయన స్థానంలో ఉద్యోగంలో చేరారు. రోజూ తడి, పొడి చెత్త వేరు చేయడం.. ఇనుము, గాజు అమ్మకం ద్వారా పంచాయతీకి ఆదాయం వచ్చేలా చేస్తున్నారు. వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువుగా మార్చడం వంటి పనులు నిర్వహిస్తారు. – న్యూస్‌టుడే, కొడంగల్



ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో లక్ష్మి

అతివలకు అండగా నిలుస్తూ..

ఆమె చదివింది ఏడో తరగతే. అయినా తనవంతుగా ఏదైనా చేయాలన్న సంకల్పంతో అడుగేసి నిస్సహాయులకు అండగా నిలుస్తున్నారు. ఆమే నర్సాపూర్ మండలం లింగాపూర్‌కు చెందిన చింతల లక్ష్మి. కొన్నేళ్ల కిందట గ్రామంలో భువనేశ్వరి స్వయం సహాయక సంఘాన్ని ఏర్పాటుచేశారు. స్థానిక మహిళలకు అవగాహన కల్పించి సంఘంలో చేర్పించి పొదుపు బాట పట్టించారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవడంపై చైతన్యం తీసుకొస్తూ ఎంతోమంది ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారు. జిల్లా స్థాయి కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్‌గా ఎదిగారు. ఉమ్మడి జిల్లా సమాఖ్యకు అధ్యక్షురాలిగా సైతం పని చేశారు. మరోవైపు అక్షరాస్యత పెంచేందుకు గ్రామీణ మహిళలకు చదువు నేర్పించారు. గ్రామాల్లో సేంద్రియ సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఐకేపీ జెండర్ పాయింట్ పర్సన్‌గా పనిచేస్తున్నారు. దంపతుల మధ్య వివాదాల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, నర్సాపూర్



చింతల లక్ష్మి

వీవోఏ నుంచి పారిశ్రామికవేత్తగా..

హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన బోయిని కనకతార వీవోఏగా పని చేస్తూనే వ్యాపారంలో రాణిస్తున్నారు. స్వయం సహాయక బృంద సభ్యురాలి నుంచి జాతీయ స్థాయికి ఎదిగి ఆదర్శంగా నిలిచారు. అరుంధతి సంఘం సభ్యురాలిగా అడుగిడిన ఈమె 2005 నుంచి వీవోఏ(సీఏ)గా పని చేస్తున్నారు. 2012లో టైలరింగ్ యూనిట్ ఏర్పాటుచేశారు. 40 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. తర్వాత రూ.కోటితో వేర్వేరు జిల్లాల్లో వస్త్ర సంచులు, పళ్లేల తయారీ యూనిట్లనూ నెలకొల్పారు. ఈ నెల 17న దిల్లీలో జరిగే జాతీయస్థాయి పారిశ్రామికవేత్తలు, బ్యాంకర్ల సదస్సులో పాల్గొనే అవకాశాన్ని అందుకున్నారు.

– న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం



వస్త్ర సంచుల తయారీలో కనకతార

ఇటు పొలం.. అటు చిత్రీకరణ



సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం హుమ్నాపూర్‌కు చెందిన లక్ష్మమ్మ చిన్నతనం నుంచి వ్యవసాయ కూలీగా పని చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో జహీరాబాద్‌కు చెందిన దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్)లో చేరిన తర్వాత ఆమె జీవితం మలుపు తిరిగింది. సంస్థ నిర్వాహకుల ప్రోత్సాహంతో వీడియో చిత్రీకరణ నేర్చుకున్నారు. 35 ఏళ్లకు పైగా పలు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై వీడియోలను తీసి గుర్తింపు దక్కించుకున్నారు. 52 ఏళ్ల ఈ మహిళ సేంద్రియ విధానంలో చిరుధాన్యాల సాగు చేస్తున్నారు. సంప్రదాయ పద్ధతిలో విత్తనాలను నిల్వ చేస్తూ సంస్థకు, రైతులకు అందిస్తున్నారు. వివిధ రాష్ట్రాలతో పాటు 11కు పైగా దేశాల్లో పలు సమావేశాలను చిత్రీకరించారు. – న్యూస్‌టుడే, జహీరాబాద్

క్రీడాకారిణులను తీర్చిదిద్దుతూ..



సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం మాటిండ్లకు చెందిన భాగ్యమ్మ.. ఫుట్‌బాల్ శిక్షకురాలిగా ఎంతో మంది క్రీడాకారిణులను తీర్చిదిద్దుతున్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఈమె హకీంపేట క్రీడా పాఠశాలలో శిక్షణ పొందారు. రాష్ట్ర స్థాయిలో 6 స్వర్ణ పతకాలు సాధించారు. 12 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానంలో నిత్యం 80 మంది విద్యార్థినులకు మెలకువలు నేర్పిస్తున్నారు. ఈమె పర్యవేక్షణలో శిక్షణ పొందిన సీనియర్ మహిళా జట్టు గత నెలలో నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఫైనల్‌కు చేరుకుంది. తాజాగా మెదక్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల రాష్ట్ర స్థాయి పోటీల్లో మెదక్ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. – న్యూస్‌టుడే, మెదక్ టౌన్

జాతీయ యోగా పోటీలకు ఎంపిక



మాధవి, శాకేర

కొండాపూర్: జాతీయ స్థాయి యోగా పోటీలకు కొండాపూర్ మండలం గంగారం ఉన్నత పాఠశాల విద్యార్థులు మాధవి, శాకేర ఎంపికయ్యారని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, రమేశ్ సోమవారం తెలిపారు. పటాన్‌చెరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారన్నారు. నవంబరు 11 నుంచి 14 వరకు అస్సాంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు.

కథ రాసి.. బహుమతి దక్కించుకొని..



ప్రహర్ణి

సిద్దిపేట, న్యూస్‌టుడే: హైదరాబాద్‌కు చెందిన మాచిరాజు బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కథల పోటీల్లో నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ప్రహర్ణి ప్రతిభ కనబర్చారు. విద్యార్థిని రాసిన 'సాహసం' కథ ప్రోత్సాహక బహుమతికి ఎంపికైంది. పోటీలకు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన 232 కథల్లో 28 వివిధ విభాగాల్లో ఉత్తమంగా నిలిచాయి. వాటిలో ప్రహర్ణి రాసిన కథ ఒకటవడం విశేషం. నవంబరు 3న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రం ప్రదానం చేయనున్నారు. ఆమెను హెచ్ఎం షౌకత్అలీ, ఉపాధ్యాయులు అభినందించారు.



న్యాల్‌కల్ బసవన్నకు జాతీయస్థాయి గుర్తింపు

జహీరాబాద్ అర్బన్(న్యాల్‌కల్), న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు హోతి బస్వరాజు రూపొందించిన 'మాడ్రన్ హస్బెండ్రీ' కళాకృతి జాతీయస్థాయి పోటీల్లో ద్వితీయ బహుమతి దక్కించుకుంది. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో 'ఇండియన్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్' నిర్వహించే 'ఆల్ ఇండియా ఎగ్జిబిషన్ ఆఫ్ ఆర్ట్స్-2024' పోటీల్లో దీన్ని ప్రదర్శించారు. ఈనెల 26న బస్వరాజు పురస్కారం అందుకోనున్నారు.

నూతన ఆవిష్కరణలే లక్ష్యం

ఐఐటీహెచ్-కెన్యా బృందం ఒప్పందం



ఐఐటీహెచ్‌లో కెన్యా బృందం సభ్యులు

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: కెన్యా నేషనల్ ఇన్నోవేషన్ ఏజెన్సీ బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా ఐఐటీహెచ్‌ను సోమవారం సందర్శించింది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలే లక్ష్యంగా ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన టెక్నాలజీ ఇంక్యుబేషన్ సెంటర్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇండియా-కెన్యా ఇన్నోవేషన్ నెక్సస్ పేరుతో రూపొందించిన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కెన్యా పార్లమెంట్ సభ్యులు ఎదిత్ వెతి నైన్జ్, అమినా దికా అబ్దుల్లాహితోపాటు 11 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి మాట్లాడుతూ తాజాగా కుదుర్చుకున్న ఒప్పందంతో ఇరు దేశాలకు ప్రయోజనం చేకూరనుందన్నారు. సాంకేతిక, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ రంగాల్లో సంయుక్త పరిశోధనలకు మార్గం సుగమం కానుందని పేర్కొన్నారు.

అబ్దుల్‌కలాంకు చిత్ర నివాళి

భారత క్షిపణి పితామహుడు, ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రజ్ఞుడు, భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని మంగళవారం జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన పత్రచిత్రకారుడు గుండు శివకుమార్ ఎండిన రావి ఆకులపై మిస్సైల్ మ్యాన్ చిత్రాలు, పచ్చి ఆకులపై కలాం చిత్రాలు, అరచేతిలో, చేతివేలి గోర్లపై కలాం చిత్రాలు, కాగితంపై క్షిపణి, కలాం వివిధ వయస్సులోని చిత్రాలను మలిచి చిత్ర నివాళులు అర్పించారు.

– న్యూస్‌టుడే, నారాయణఖేడ్



సాహిత్యంతో సమాజంలో మార్పు సాధ్యం



శ్రీయశస్విని గ్రంథం విడుదల చేస్తున్న కవులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మంచి మాటలు, సాహిత్యం ద్వారా సమాజంలో మార్పు సాధ్యమని ప్రముఖ కవి, అవధాన విద్యాపీఠం అధ్యక్షుడు మరుమాముల దత్తాత్రేయశర్మ అన్నారు. సిద్దిపేటలోని వ్యాసమహర్షి యోగా కేంద్రంలో సోమవారం శ్రీయశస్విని గ్రంథ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆయన హాజరై మాట్లాడారు. పద్యం ప్రాచీనమైన ప్రక్రియ అయినా నిత్యనూతనంగా, ఉత్తేజితంగా సమాజానికి చేరుతుందన్నారు. 180 మంది కవులతో ఏక మకుటంతో 1800లకు పైగా పద్యాలు చదివే అవకాశం శ్రీయశస్విని గ్రంథం ద్వారా లభించటం సంతోషకరమన్నారు. కవులకు, కళాకారులకు పుట్టినిల్లు సిద్దిపేట అన్నారు. పుస్తక సంపాదకులు, అవధాని డా. బోచ్కర్ ఓంప్రకాశ్ మాట్లాడుతూ.. శ్రీయశస్విని గ్రంథంలోని ప్రతీపద్యం జనజీవనంలోని అంశాలను గుర్తు చేస్తాయన్నారు. కార్యక్రమంలో కవులు ఉండ్రాళ్ల రాజేశం, సాయిప్రసాద్, ఎన్నవెల్లి రాజమౌళి, సతీష్, రాజ్‌కుమార్, జబర్దస్త్ లక్ష్మీకిరణ్, సింగితం నరసింహారావు, లక్ష్మయ్య, రంజిత్‌కుమార్, ఫణీంద్ర, లక్ష్మి పాల్గొన్నారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	126-00	డ్రెస్డ్	215-00
రిటైల్	148-00	స్కిన్‌లెస్	244-00

రైతేరాజు

సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, సస్య రక్షణపై రైతుల ప్రశ్నలకు సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయ కర్త విజయ్ సమాధానాలు ఇచ్చారు.

సాగులో సందేహాలా?
సంప్రదించాల్సిన ఫోన్ నం: **93815 15588**

ప్రశ్న: బెండ తోటకు పచ్చదోమ ఆశించింది. ఏం చేయాలి? – విజయ్, కొండాపూర్

సమాధానం: పచ్చదోమ కాయలను తినేసి నష్టపరుస్తుంది. ఇమిడాక్లోప్రిడ్ 1 మి.లీ... లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది. – న్యూస్‌టుడే, చేర్యాల

సెనగ సాగు.. సమయం ఆసన్నం!

న్యూస్‌టుడే, చేర్యాల



సరం. విత్తనశుద్ధి తప్పనిసరి.



విజయ్

పప్పు దినుసులకు ఎల్లప్పుడూ డిమాండ్ ఉంటుంది. వాటిలో కంది తర్వాత సెనగ పప్పుది రెండో స్థానం. అయితే సెనగ సాగుకు ప్రస్తుతం అనుకూలమైన సమయం. ముఖ్యంగా నల్లరేగడి భూముల్లో దీన్ని సాగు చేస్తే అధిక దిగుబడులు సాధ్యమని సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయకర్త, సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జక్కుల విజయ్ సూచిస్తున్నారు. వివరాలు ఇలా..

అక్టోబరు- నవంబరు నెలల్లో సెనగ సాగు చేయవచ్చు. నల్లరేగడి నేలలు అనుకూలం. ఈ నేలల్లో నిల్వ ఉండే తేమను ఉపయోగించుకుంటూ మొక్కలు పెరుగుతాయి. చౌడు నేలలు పనికి రావు. తొలకరిలో వేసిన పైరును కోసిన తర్వాత భూమిని నాగలితో ఒకసారి, గొర్రుతో రెండుసార్లు మెత్తగా దున్ని చదును చేసుకోవాలి.

రకాలు, మోతాదు..

జె.జి.11, జె.ఎ.కె.ఐ.9218, కె.ఎ.కె.2, క్రాంతి(ఐ.సి.సి.37), శ్వేత(ఐ.సి.సి.వి.2), అన్నెగిరి, జ్యోతి, ఐ.సి.సి.వి.10 రకాలు మేలైనవి. వీటన్నింటి పంట కాలం 90-110 రోజులు. ఎకరాకు 6-10 క్వింటాళ్లు దిగుబడి వస్తుంది. ఎకరాకు 30-40 కిలోల విత్తనం అవసరం. విత్తనశుద్ధి తప్పనిసరి.

ఎరువులు, నీటి యాజమాన్యం..

ఎకరాకు 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 16 కిలోల గంధకాన్ని ఇచ్చే ఎరువులను చివరి దుక్కిలో వేసుకోవాలి. సెనగ వర్షాధారపు పంట. తేలికపాటి నీటి తడులు పెడితే సరిపోతుంది. పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పూత, కాయ దశల్లో తడులు అందించాలి.

అంతర కృషి..

విత్తే ముందు ఫ్లూక్లోరాలిన్ 45 శాతం మందును ఎకరాకు లీటరు చొప్పున పిచికారీ చేసి భూమిలో కలియదున్నాలి. లేదంటే పెండిమిథాలిన్ 30 శాతం మందును ఎకరాకు 1- 1.5 లీటర్లు చొప్పున విత్తిన వెంటనే గాని మరుసటి రోజు గానీ పిచికారీ చేయాలి. విత్తిన 20-25 రోజుల తర్వాత గొర్రుతో అంతరకృషి చేయాలి. పంటకు పచ్చ, రబ్బరు పురుగుల బెడద ఉంటుంది. ఎండు తెగులు, వేరుకుళ్లు తెగుళ్లు సోకుతుంది. వీటి నివారణకు అందుబాటులో ఉండే వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి. కోతకు వచ్చిన మొక్కలను పీకి ఆరబెట్టాలి. ఆరిన తర్వాత వారం రోజుల వరకు కుప్ప కట్టి ఉంచాలి. తర్వాత నూర్పిడి చేయాలి.

చేపల ఎదుగుదలకు పొటాషియం పర్మాంగనేట్

చేపల పెంపకంలో పలు రకాల జాగ్రత్తలు తీసుకోవాలి. చెరువుల్లో సున్నం, సాధారణ ఉప్పు, పొటాషియం పర్మాంగనేట్, కాపర్ సల్ఫేట్ వినియోగించడం మంచిది. సున్నం నీటి నాణ్యతను మెరుగుపరుస్తుంది. పొటాషియం పర్మాంగనేట్ చేపల్లో వ్యాధినిరోధక శక్తిని పెంచుతుంది. కాపర్ సల్ఫేట్‌తో ఫంగస్, శంకుపూత వ్యాధులను అరికట్టవచ్చు. ఇక ప్రోటోజోవన్, క్రస్టేషియన్ పరాన్నజీవుల నిర్మూలనకు ఉపయోగపడుతుంది.

– న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

సాగుపై మక్కువ.. లాభాల ఆర్జన



నర్సింలు

ఆ యువకుడికి సాగంటే ఎంతో మక్కువ. డిగ్రీ పూర్తిచేశాక ఉన్నత విద్య చదివేందుకు వెళ్లకుండా ఇష్టమైన వ్యవసాయంపై దృష్టిసారించారు. అందులోనూ అందరిలా కాకుండా కాలానికి అనుగుణంగా పంటలు పండిసూ లాభాలు ఆర్జిస్తున్నారు. అతడే మెదక్ జిల్లా పాపన్నపేటకు చెందిన సింధోల్ నర్సింలు. డిగ్రీ పూర్తయ్యాక సాగుపై ఇష్టంతో సంబంధిత విషయాలు తెలుసుకున్నారు. మెలకువలు నేర్చుకున్నారు. ఏ కాలంలో దేనికి డిమాండ్ ఉంటుందో గమనించారు. ఆయనకు మొత్తం 12 ఎకరాల పొలం ఉంది. ఏటా దసరా, దీపావళి పండగల సందర్భంగా మూడు నెలల ముందుగా ఎకరా పొలంలో బంతి సాగు చేస్తున్నారు. నారును హైదరాబాద్ నుంచి తీసుకొస్తున్నారు. పక్కాగా సస్యరక్షణ చర్యలు పాటిస్తున్నారు. నారింజ, పసుపు వర్ణాలకు సంబంధించిన పూలను పండిస్తున్నారు. వ్యవసాయాధికారుల సూచనలతో అవసరం మేర పురుగు మందులు వాడుతున్నారు. మూడు నెలల్లో మూడు కోతల మేర దిగుబడి వస్తోంది. నారు, కూలీలు, మందులు తదితర వాటికి రూ.50 వేల వరకు ఖర్చవుతోంది. మూడు కోతల్లో 5 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. హైదరాబాద్, మెదక్, సంగారెడ్డి మార్కెట్లకు తరలించి విక్రయిస్తున్నారు. తద్వారా రూ.2 లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు. ఖర్చులన్నీ పోగా రూ.1.50 లక్షలు లాభం మిగులుతోంది. మిగతా సమయాల్లో కూరగాయలు పండిస్తున్నారు. – న్యూస్‌టుడే, పాపన్నపేట

పాటించు.. నివారించు..

కాకర పంటలో ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులతో ఆకుల మధ్య పచ్చగా మారి ఈనెలు ఉబ్బుతున్నాయి. బూజు తెగులు ఆశించి ఇలా జరుగుతుంది. ఆకులు సైతం కిందికి ముడుచుకుపోతాయి. దీని నివారణకు మెటలాక్సిల్, మాంకోజెబ్ 2 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది. – న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్

తెల్లజొన్నలో విత్తనశుద్ధి కీలకం

యాసంగిలో రైతులు తెల్లజొన్న సాగు చేపడతారు. విత్తు దగ్గర నుంచి పంట చేతికొచ్చే వరకు సస్యరక్షణ చర్యలు చేపడితే ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి సాధ్యమని తాండూరు వ్యవసాయ పరిశోధనా స్థానం జొన్న పంట శాస్త్రవేత్త డాక్టర్ సుజాత తెలిపారు. నల్లరేగడి భూములు పంట సాగుకు అనుకూలం. మొక్కల వరుసల మధ్య దూరం అడుగున్నర, మొక్కకు మొక్కకు మధ్య అరడుగు దూరం పాటించాలి. పంట నాలుగు నెలల్లో చేతికొస్తుంది. విత్తనాలు నాటే ముందు శుద్ధి చేయాల్సిందే. కిలో విత్తనానికి 7మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ లేదా 2గ్రా. థయామిథాక్సమ్‌ను కలిపి విత్తన శుద్ధి చేయాలి. లేదంటే నెల రోజుల్లో మొవ్వ తొలుచు పురుగులు ఆశిస్తాయి. – న్యూస్‌టుడే, తాండూరు

వనరుల సంరక్షణతోనే నీటి ఎద్దడి నివారణ



గ్రామస్థులతో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

గొడిగార్‌పల్లి(కోహీర్), న్యూస్‌టుడే: జల వనరుల సమర్థ నిర్వహణతో భూగర్భ జలాలు పెరిగి, భవిష్యత్తులో ఎద్దడి నివారణ సాధ్యమవుతుందని జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ మాజీ ఉపాధ్యక్షుడు మర్రి శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలం గొడిగార్‌పల్లి సమీపంలో కొన్నేళ్ల కిందట 'చతుర్విధ జల ప్రక్రియ' ద్వారా ఏర్పాటు చేసిన వాటర్‌షెడ్ పథకం నిర్మాణాన్ని సోమవారం ఆయన పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తమ్‌రెడ్డి, మాజీ సర్పంచి రాచయ్య తదితరులు పాల్గొన్నారు.

మితిమీరిన వేగం.. అదుపుతప్పిన వాహనం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం



మల్లేశం



రసూల్‌ఖాన్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: దసరా పండుగకు స్వగ్రామానికి వచ్చిన ఓ యువకుడు మిత్రులను కలిసేందుకు ద్విచక్రవాహనంపై వేరే గ్రామానికి వెళ్లి, తిరిగి వస్తూ వేగాన్ని నియంత్రించలేక, ఆందోళనకు గురై రోడ్డు దాటుతున్న ఇద్దరిని ఢీకొట్టగా వారిలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. చివరకు వాహనాన్ని అదుపు చేయలేక తానూ కిందపడి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన సిద్దిపేటలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. సిద్దిపేట టూటౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామానికి చెందిన ముడికె మల్లేశం (32) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పని చేస్తున్నాడు. దసరా పండుగకు సొంతూరికి నాలుగురోజుల కిందట వచ్చాడు. ఆదివారం స్నేహితులను కలుద్దామని, మిట్టపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్లి, అదేరోజు అర్ధరాత్రి తిరుగు పయనమయ్యాడు. సిద్దిపేట రంగీలా దాబా చౌరస్తా వద్ద రోడ్డు దాటుతున్న డ్రైవర్లు గణేశ్, రసూల్ ఖాన్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గణేశ్ గాయపడగా, రసూల్‌ఖాన్ (36) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో మరింత ఆందోళన గురైన మల్లేశం వాహన వేగం పెంచి, కొంత దూరం వెళ్లాక అదుపుతప్పి కిందపడి దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న మల్లేశం సోదరుడు అక్కడికి చేరుకుని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. మల్లేశానికి తల్లి, భార్య, కుమారుడున్నారు. రసూల్‌ఖాన్ స్వస్థలం కర్ణాటక బీదర్. ఆయన సోదరుడు అంజద్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

కారు బోల్తాపడి వృద్ధుడు..



నర్సయ్య

నార్సింగి(చేగుంట), న్యూస్‌టుడే: కారు అదుపుతప్పి బోల్తా పడటంతో అందులో ఉన్న వృద్ధుడు మృతిచెందిన ఘటన నార్సింగి మండలం వల్లూరు వద్ద సోమవారం జరిగింది. స్థానిక ఎస్సై అహ్మద్ మొహినొద్దీన్ తెలిపిన వివరాలు.. మాసాయిపేట మండలం అచ్చంపేటకు చెందిన కత్తెర నర్సయ్య(70) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బంధువు యాదగిరి వైద్యం కోసం నార్సింగిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొచ్చాడు. కొన్ని పరీక్షలు హైదరాబాద్‌లో చేయించుకొని రావాలని వైద్యులు సూచించారు. దీంతో కొంపల్లికి వెళ్లి అక్కడ పరీక్షలు చేయించుకొని తిరిగి కారులో నార్సింగికి వస్తున్నారు. వల్లూరు దాటగానే కారు అదుపుతప్పి బోల్తాపడటంతో అందులో ఉన్న నర్సయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కారు నడిపిస్తున్న యాదగిరితో పాటు మరో వ్యక్తి గాయపడ్డాడు. వారిని చికిత్స నిమిత్తం నార్సింగిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువు సిద్ధిరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

కుంటలో పడి యువకుడు..



నితిన్

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: అనుమానాస్పదస్థితిలో కుంటలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన సిద్దిపేట శివారులో సోమవారం జరిగింది. పట్టణ మూడో ఠాణా సీఐ విద్యాసాగర్ తెలిపిన ప్రకారం సిద్దిపేట పట్టణం సుభాష్‌నగర్‌కు చెందిన పేర్ల నితిన్(22)కు ఏడాది కిందట పోస్టుమాస్టర్ ఉద్యోగం వచ్చింది. జగదేవపూర్ మండలం చాట్లపల్లిలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం ఉదయం మిత్రుడు రోహిత్‌తో కలిసి ఇంటినుంచి బయటకు వెళ్లి, రాత్రైనా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా, తాత పెంటయ్య వద్ద ఉన్నానని సమాధానం ఇచ్చాడు. సోమవారం ఉదయం ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అనుమానంతో కుటుంబ సభ్యులు నితిన్ ఆచూకీ కోసం వెతుకుతుండగా, పట్టణ శివారులోని తిమ్మికుంట వద్ద అతని చెప్పులు కనిపించాయి. కుంటలో వెతికించగా మృతదేహం లభ్యమైంది. నితిన్‌కు తల్లి లక్ష్మి, తండ్రి రాజు, సోదరి ఉన్నారు. మృతిపై అనుమానం ఉందని తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదైందని సీఐ తెలిపారు.

తల్లి ఆస్తి పంచివ్వలేదని.. తనయుడి బలవన్మరణం

హత్నూర, న్యూస్‌టుడే: తనకు రావాల్సిన భూమి వాటాను తల్లి పంచివ్వడం లేదన్న మనస్తాపంతో కుమారుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. మండల పరిధి దేవులపల్లిలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు.. దేవులపల్లికి మహ్మద్ మహబూబాకు షఫీ, యాదుల్లా కుమారులు. సోదరులిద్దరు వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. ఉమ్మడి ఆస్తికి చెందిన భూమి తల్లి పేరిట ఉంది. షఫీ చిన్న కూతురి వివాహం నిశ్చితార్థమయింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. తనకు రావాల్సిన భూమి వాటాను పంచివ్వాలని తల్లిపై ఒత్తిడి తెచ్చాడు. ఆమె ససేమిరా అనడంతో కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనోవేదనకు గురైన షఫీ గ్రామ సమీపంలోని ఎర్రకుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీశారు. షఫీ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


చెరువులో దూకి మరొకరు..



మల్లికార్జున్

శివ్వంపేట, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లుట్ల గ్రామానికి చెందిన లెంకల మల్లికార్జున్ (40) మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో భార్య మాధవితో గొడవపడి దసరా రోజు శనివారం పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. దసరా రోజు గ్రామస్థులకు చెరువు వద్ద కనిపించిన మల్లికార్జున్ అప్పటి నుంచి ఆచూకీ లేదు. సోమవారం చెరువు వద్ద చూడగా ఆయన మృతదేహం లభించింది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదైంది. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పాముకాటుతో మహిళ మృత్యువాత



జ్యోతి

శివ్వంపేట, న్యూస్‌టుడే: పాముకాటుకు గురైన మహిళను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. శివ్వంపేట ఎస్ఐ మహిపాల్ రెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. దంతాన్‌పల్లి గ్రామానికి చెందిన గేడి జ్యోతి(28) ఆదివారం సాయంత్రం ఇంటి దగ్గర గేదెలకు గడ్డివేసే క్రమంలో పాము కాటు వేసింది. వెంటనే కామారెడ్డి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. జ్యోతికి భర్తతో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు.

పదేళ్లుగా.. పరిష్కారం కరవు!

ఓడీఎఫ్ కాలనీలో సమస్యల వెల్లువ



బురదగా మారిన రోడ్డు

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి శివారులో ఓడీఎఫ్ కాలనీ ఏర్పడి పదేళ్లు అవుతోంది. ఉద్యోగులు, వ్యాపారులు ఎక్కువగా నివాసం ఉడటంతో పెద్దపెద్ద భవనాలు నిర్మితమైనప్పటికీ రోడ్లు, మురుగు కాలువలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సమస్యలను కౌన్సిలర్, పురపాలక అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో 'ఎస్‌డీఎఫ్' కింద కొన్ని అభివృద్ధి పనులు చేపట్టినా... వాటిల్లో చాలావరకు పనులు నిలిచిపోయాయి. దీంతో సమస్యలు ఎప్పటి మాదిరిగానే మిగిలాయి.

అసౌకర్యాలతో సహవాసం

ఓడీఎఫ్ కాలనీ విస్తరిస్తున్న స్థాయిలో... అభివృద్ధి మాత్రం జరగడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. అంతర్గత దారుల్లో మురుగు కాలువల్లేక పరిస్థితులు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. చిన్నపాటి వర్షానికి బురద తేలి గుంతలుగా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. బైపాస్ దారి నుంచి కాలనీ మీదుగా రాజంపేటకు వెళ్లే దారిలో సగం మాత్రమే బీటీ వేశారు. ఓడీఎఫ్ నుంచి బృందావన్ కాలనీ మీదుగా జాతీయ రహదారికి వెళ్లే రెండు ప్రాంతాల్లోనూ పరిస్థితులు అధ్వానంగా మారాయి. ఇళ్లలోని వ్యర్థపు నీరు దారిలో నిలుస్తుండటంతో అంటు వ్యాధులు ప్రబలుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. వీధి దీపాలు కూడా పూర్తిస్థాయిలో వెలగడం లేదు.

నిధులున్నా... సాగని పనులు

కాలనీ అభివృద్ధికి ఎస్‌డీఎఫ్ నుంచి రూ.1.50 కోట్ల నిధులు కేటాయించినా.. వీటి నుంచి ఇప్పటి వరకు రూ.70 లక్షలు మాత్రమే ఖర్చయ్యాయి. మిగిలిన నిధులతో పనులు చేయిస్తే కొంతవరకైనా కాలనీ సమస్యలు పరిష్కారం అవుతాయి. అధికారులు స్పందించి రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై డీఈఈ ఇంతియాజ్ అహ్మద్‌ను 'న్యూస్‌టుడే' ప్రతినిధి వివరణ కోరగా పెండింగ్ పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉల్లి పంటపైనే ఆశలు



మార్కెట్‌లో డిమాండ్‌తో పెరుగుతున్న సేద్యం

నారాయణఖేడ్ టౌన్, న్యూస్‌టుడే: ఈ సారి పుష్కలంగా వర్షాలు కురియడంతో బోరు, బావుల్లో నీటి మట్టం పెరిగింది. ప్రస్తుతం ఉల్లి పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో సాగుపై రైతన్నలు మొగ్గుచూపుతున్నారు. ఖరీఫ్‌లో వేసిన పెసర, మినుము, సోయా పంటలకు అధిక వర్షాలతో నష్టం వాటిల్లింది. ఆ భూముల్లో ఉల్లి పంట వేస్తే ఆదుకుంటుందని రైతులు మొగ్గుచూపుతున్నారు. భూములను దుక్కులు చేసి నాట్లకు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే ఉల్లి నారును పెంచారు. ఈ పంట 100 రోజుల్లో చేతికి వస్తుండటంతో తక్కువ వ్యవధిలో ఎక్కువ లాభం వస్తుందనే ఆశతో రైతులు ఉల్లిసాగుపై మొగ్గు చూపుతున్న తీరుపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

ఇదీ సంగతి: జిల్లాలో నారాయణఖేడ్, జహీరాబాద్, అందోలు నియోజకవర్గాల్లో ఉల్లి పంట అధికంగా సాగు చేస్తుంటారు. ఇందులో తుమ్నూర్, రాణాపూర్, ఎల్గోయి, దుద్‌గొండ, దోసపల్లి, మాయికోడ్, జి.హోత్రాన, పంచాగామ, పిప్రి, ముగ్దంపూర్, ఉట్‌పల్లి, శెల్గిర, డొవ్వూర్ తదితర గ్రామాల్లో ఎక్కువ సంఖ్యలో ఉల్లి సాగవుతుంది. గతం కంటే ఈసారి వర్షాలు సంవృద్ధిగానే కురియడంతో మనూరు మండలంలో పారుతున్న మంజీర నది పరిసరాల్లోనూ పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గత సంవత్సరం వట్టిపోయిన బోరు, బావుల్లో ఈసారి పుష్కలంగా నీరుంది. ప్రతీ ఏడాది నారాయణఖేడ్ నియోజకవర్గంలో సుమారు 2వేల ఎకరాల వరకు ఉల్లి పంట సాగవుతుండగా ఈసారి వర్షాలు ఎక్కువగా కురియడంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

సాగు విధానం: మొదట ఉల్లి పంట సాగు చేయాలంటే భూమిని చదును చేసి ఉల్లి విత్తనాలు చల్లాలి. తదుపరి 45 రోజులకు నారు వేసుకోవచ్చు. నాటు వేసిన 100 రోజులకు పంట కోతకు వస్తుంది. పంట వేసిన నుంచి కోతకు వచ్చే వరకు రెండుసార్లు కలుపు తీయాల్సి ఉంటుంది. రెండు మార్లు పొటాష్, డీఏపీ, యూరియా తదితర ఎరువులు చల్లాల్సి ఉంటుంది. రెండు కిలోల విత్తనాలకు ఒక ఎకరం వరకు వేసుకోవచ్చు. ఒక ఎకరంలో పంట బాగా పండితే సుమారు 70 నుంచి 80 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుంది. ఎకరాకు రూ.25 వేల వరకు పెట్టుబడులకు ఖర్చవుతుంది. ఈసారి కిలో ఉల్లి విత్తనాలకు రూ.800 నుంచి రూ.1000 వరకు అమ్ముతున్నారు. తక్కువ వ్యవధి ఎక్కువ ఆదాయం వచ్చే పంట కావడంతో కొత్త రైతులు కూడా ఉల్లి పంట సేద్యానికి మొగ్గుచూపుతున్నారు. వర్షాలతో పంటలు నష్టపోయిన వారంతా ఉల్లి నాట్లలో నిమగ్నమయ్యారు.

వర్ష నష్టం పూడ్చుకుందామని!

ఈసారి అధిక వర్షాలతో పెసర, మినుము, సోయా తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. ప్రస్తుతం బోరు బావుల్లో సమృద్ధిగా నీరు రావడంతో ఉల్లి గట్టెక్కిస్తుందని అన్నదాతలు సాగు చేస్తున్నారు. నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీలకు చేతినిండా పని ఉండటంతో సత్పప్తి వ్యక్తం చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM)
సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363
నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250
అందోలు 8008573241, జిన్నారం 8008573231

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ


? సంగారెడ్డి పట్టణం శివాజీ నగర్‌లో మురుగు కాలువ నిండి రోడ్డుపై పారుతుంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.
- యాదగిరి, సంగారెడ్డి.

✓ వెంటనే సిబ్బందిని పంపి మురుగు శుభ్రం చేయిస్తాం.
- సైదులు, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు.

? సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లిలోని బ్యాంక్ కాలనీలో మంచినీటి సమస్య ఉంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.
- రాములు, సంగారెడ్డి.

✓ ప్రతిరోజు గంటపాటు నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం. **- ఇంతియాజ్ అహ్మద్, పురపాలక డీఈఈ.**

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, నారాయణఖేడ్: సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేదల వైద్యానికి భరోసా కలుగుతుందని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. జహీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో సోమవారం రంజోల్‌కు చెందిన తుల్జమ్మ, హద్నూర్‌కు చెందిన పద్మకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. * కల్హేర్ మండలం ఫత్తేపూర్‌కు చెందిన ఎల్లవ్వకు, బీబీపేటకు చెందినపీరయ్యకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం మంజూరుకాగా అందుకు సంబంధించిన చెక్కులను సోమవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఖేడ్‌లోని తన స్వగృహంలో తనచేతులమీదుగా అందజేశారు. నాయకులు సుధాకర్‌రెడ్డి, మశ్చందర్, గోవింద్, ఈశ్వర్, తుకారాం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి: ఎంపీ సురేష్‌షెట్కార్



రాపర్తిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం నినాదాలు చేస్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు

సిర్గాపూర్, కల్హేర్: బాబాసాహెబ్ అంబేడ్కర్ గొప్ప నాయకుడని, దేశానికి ఎనలేని సేవలు చేసిన ఆయన బాటలో నడవాలని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ పిలుపునిచ్చారు. సోమవారం రాపర్తి గ్రామంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ అందరివాడని, ఆయన చూపిన మార్గంలో నడుచుకోవాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లేశం, మాజీ సర్పంచి శ్రవణ్ కుమార్, నాయకులు శ్రీకాంత్, హన్మండ్లు, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థికి సన్మానం

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: ఇటీవల వెలువడిన ఐటీఐ(వెల్డర్) ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన ఖేడ్ మండలం లింగాపూర్‌కు చెందిన ఫకీర్‌యాదుల్‌ను సోమవారం జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ ఖేడ్‌లో సన్మానించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాహెర్‌అలీ, కంగ్టి మాజీ ఎంపీపీ రామారావు, నాయకులు జ్ఞానేశ్వర్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

బంపర్ డ్రా విజేత ప్రకటన

సదాశివపేట: కాసం ఫ్యాషన్స్ సదాశివపేట దసరా మహోత్సవంలో భాగంగా ప్రకటించిన 'ప్రతి ఊరికి ఒక బైక్' బంపర్ డ్రా విజేతలను సోమవారం ప్రకటించారు. భావన శ్రీజ కూపన్ నంబర్ సీఏ 39023180/09/24 విజేతగా నిలిచారు.

ఇల్లు మంజూరు చేయండి

సంగారెడ్డి టౌన్: దివ్యాంగురాలినైన తనకు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయాలని సంగారెడ్డి పట్టణానికి చెందిన వడ్ల సోనీ సోమవారం కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సంగారెడ్డి మండలం హనుమాన్‌గడ్డలో ఇల్లు కేటాయిస్తున్నట్లు అధికారులు చెప్పినా మంజూరు పత్రాలు ఇవ్వలేదని, ఇప్పటికైనా స్పందించి న్యాయం చేయాలని కోరారు.

సిలిండర్ల లారీ బోల్తా... నిలిచిన వాహనాలు

సదాశివపేట: జాతీయ రహదారిపై సోమవారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పెద్దాపూర్ శివారులో నుంచి గ్యాస్ సిలిండర్లు తీసుకెళ్తున్న లారీ అదుపుతప్పి రహదారిపై బోల్తాపడింది. సిలిండర్లు రహదారిపై అడ్డుగా పడిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని సిలిండర్లను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వైభవంగా మల్లన్నస్వామి పల్లకిసేవ



జహీరాబాద్: కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా బాల్కి తాలూకా ఖానాపూర్‌లో వెలసిన మల్లన్న స్వామి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన పల్లకిసేవ ఆదివారం అర్ధరాత్రి వరకు సాగింది. తెలంగాణనతో పాటు కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. కార్యక్రమంలో బీదర్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఈశ్వర్‌కంద్రె, మాజీ మంత్రి బండెప్పకాశీంపూర్, రాష్ట్ర మత్స్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ నారాయణరావ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రకాశ్‌మైత్రే, కార్యనిర్వాహణాధికారి అనంతరావు పాల్గొన్నారు.

వేదిక నిర్మాణానికి భూమిపూజ



నారాయణఖేడ్: ఖేడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983-84లో పదోతరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు 'మిత్ర సోషల్ సర్వీస్ అసోసియేషన్' ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు విస్తరించారు. సోమవారం పాఠశాలలో స్టేజీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. జనవరి నాటికి దీనిని పూర్తిచేయడానికి నిర్ణయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్, అసోసియేషన్ అధ్యక్షులు వివేకానంద్, ప్రధానకార్యదర్శి సత్యం, ఇతర బాధ్యులు పాల్గొన్నారు.

రేపు ఖేడ్‌కు మంత్రి దామోదర్ రాజనర్సింహ

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గంలో బుధవారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యటించనున్నారని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఆరోజు ఉదయం 11:30 గంటలకు నిజాంపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభిస్తారని, అనంతరం మధ్యాహం 2:30 గంటలకు సిర్గాపూర్ మండలం వాసర్‌లో నిర్మించనున్న సమీకృత గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ పాల్గొంటారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మంత్రిని కలిసిన అనంతకిషన్

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను పీసీసీ మాజీ కార్యదర్శి తోపాజీ అనంతకిషన్ సోమవారం చౌటకూర్ మండలం తాడ్దాన్‌పల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రిని సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

సదాశివపేట, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని బాబిల్‌గామకు చెందిన ఎం.నర్సింలు(43) స్థానికంగా సెలూన్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై స్థానిక హనుమాన్ మందిరం వైపు వెళుతుండగా ప్రమాదవశాత్తు పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో కుటుంబీకులు 108 అంబులెన్సులో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ పండుగ



ఎన్కపల్లి గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సదాశివపేట, న్యూస్‌టుడే: పెద్దాపూర్, ఎన్కపల్లి, చందాపూర్ గ్రామాల్లో సోమవారం సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను తయారు చేశారు. వీటిని ప్రధాన కూడళ్లలో పెట్టి వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడారు. అనంతరం బతుకమ్మలకు పూజలు చేసి సమీప చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు గ్రామసభలు

జిన్నారం, న్యూస్‌టుడే: ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు నిమిత్తం సోమవారం జిన్నారం మండలంలోని అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. పంచాయతీ ప్రత్యేక అధికారులు కార్యదర్శుల సమక్షంలో సభలు ఏర్పాటు చేసి కమిటీల ఉద్దేశం వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న 'ఇందిరమ్మ ఇళ్ల' పథకాన్ని జయప్రదం చేయాలని అధికారులు సూచించారు. రాళ్లకత్వంలో ఉప తహసీల్దార్ మల్లికార్జున్, గడ్డపోతారంలో ఎంపీడీవో రాజ్‌కుమార్, స్థానిక సిబ్బంది గ్రామ సభల్లో పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

జహీరాబాద్, న్యూస్‌టుడే: న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ జహీరాబాద్ ఎల్ఐసీ కార్యాలయ ఏజెంట్ల సంఘం ఆధ్వర్యంలో పలువురు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నల్ల బ్యాడ్జిలు ధరించి కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం జహీరాబాద్ శాఖ అధ్యక్షుడు విఠల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి తేజిరెడ్డి, కోశాధికారి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న రాకేష్‌షెట్కార్

నారాయణఖేడ్: నిజాంపేట మండలం బాచేపల్లితండాకు చెందిన వ్యక్తి సోమవారం ద్విచక్రవాహనంపై ఖేడ్‌కు వెళ్తూ మూడుగుంటల్ చౌరస్తా వద్ద ప్రమాదానికి గురయ్యాడు. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్ కుమారుడైన యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్‌షెట్కార్ స్పందించి క్షతగాత్రుడిని ఆటోలో ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు.

నేటి నుంచి 'గాలికుంటు' నిరోధక టీకాలు

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ఈనెల 15 నుంచి వచ్చేనెల 14వ వరకు గ్రామాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా పశువైద్యాధికారి వసంతకుమారి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాట శ్రీనివాస్‌గౌడ్‌కు సన్మానం

జిన్నారం, గుమ్మడిదల: పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కాట శ్రీనివాస్‌గౌడ్‌ను సోమవారం ఆ పార్టీ నాయకులు కలిసి సన్మానించారు. కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు వరప్రసాద్‌రెడ్డి, గుమ్మడిదల నాయకులు సురేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకటరెడ్డి, యాదగిరి, రవీందర్‌రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

తాళం వేసిఉన్న ఇళ్లలో చోరీ

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: పండుగ నేపథ్యంలో స్వగ్రామాలకు వెళ్లిన వారి ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు రెచ్చిపోయిన ఘటన పటాన్‌చెరు ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపల్ పరిధి పోచారం శివారులో ఆదివారం ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలకు వెళ్లిన రెండిళ్లలో రాత్రి దొంగలు చెలరేగిపోయారు. ప్రవీణ్ అనే వ్యక్తికి చెందిన ఇంటిలో 6 తులాల బంగారం, రమేష్ అనే వ్యక్తి ఇంట్లో 30 తులాల వెండి దొంగిలించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇళ్లలో సంచరిస్తున్న దృశ్యాలు ఇంటి సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో గుర్తుతెలియని మృతదేహం

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: గుర్తుతెలియని మృతదేహం చెరువులో తేలిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి నర్రిగూడకు చెందిన షంబి చెరువులో ఆదివారం సాయంత్రం ఓ గుర్తుతెలియని మృతదేహం నీటిలో తేలగా.. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మున్సిపల్ సిబ్బంది ధన్‌రాజ్, మల్లికార్జున్‌ల సహకారంతో మృతదేహాన్ని వెలికితీసి పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హరీశ్‌రావును కలిసిన ఖాజీపల్లివాసులు

జిన్నారం: మాజీ మంత్రి హరీశ్‌రావును జిన్నారం మండలం కాజిపల్లి గ్రామస్థులు సోమవారం కలిసి సత్కరించారు. మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ నాయకుడు నవీన‌కుమార్ తదితరులు కలిశారు.

దర్గాకు పాదయాత్ర

గుమ్మడిదల, న్యూస్‌టుడే: భారాస ఎమ్మెల్సీ కవిత ఆరోగ్యంగా ఉండాలని గుమ్మడిదల పార్టీ మైనార్టీ సెల్ నాయకుడు యూనస్ సోమవారం కొల్చారం దర్గాకు పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు.


ప్రజా సమస్యలు పరిష్కరించండి

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కరాములు అన్నారు. పటాన్‌చెరు ఐలాభవన్‌లో సోమవారం నిర్వహించిన సీపీఎం ఏరియా రెండో మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాలు ఉద్ధృతం చేస్తామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా ఇతర సమస్యలు ముందుకు తేవడం సిగ్గుచేటన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

పటాన్‌చెరు, గుమ్మడిదల, న్యూస్‌టుడే: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి ఐలాపూర్ తండాలో నివాసముండే రాత్లావత్ దేవ్(49)కు కొన్నాళ్లుగా మతిస్థిమితం సరిగాలేదు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేసుకున్నారు. ● గుమ్మడిదల మండలం దోమడుగుకు చెందిన దూదెకుల దస్తగిరి(28) ఈనెల 13వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆయన భార్య సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు

జహీరాబాద్ అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలో సోమవారం నిర్వహించిన పార్టీ డివిజన్ రెండో మహాసభలో ఆయన జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. త్వరలో జహీరాబాద్ పట్టణంలో నిర్వహించనున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సభలో ఏరియా కమిటీ కార్యదర్శి రాంచందర్, కమిటీ సభ్యులు మహిపాల్, నర్సయ్య, చంద్రన్న, కనకారెడ్డి, సంగన్న ఉన్నారు.

దారి మరమ్మతుకు 'స్వచ్ఛందంగా' నడుంబిగించారు



సంగారెడ్డి అర్బన్, ఝరాసంగం, న్యూస్‌టుడే: వర్షం వస్తే చాలు ఇరిగిపల్లి రహదారి చిత్తడిగా మారి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ రహదారిని బాగు చేయాలని ఆర్అండ్‌బీ శాఖ అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదులు చేసినా ఫలితం దక్కలేదు. గ్రామస్థులంతా ఒక్కటై స్వచ్ఛందంగా చందాలు వసూలు చేసుకుని రహదారి బాగుకు నడుంబిగించారు. రూ.15 వేలు... మూడు టిప్పర్ల మొరం పోయడంతో కిలోమీటరు మేర బాగుపడింది. గ్రామస్థులు సంఘటితంగా ఉంటే ఎంత పెద్ద సమస్యనైనా సులభంగా పరిష్కరించుకోవచ్చనేదానికి ఈ పనే నిదర్శనం. ● ఝరాసంగం సమీపంలో తారు రోడ్డుపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలను మీదపల్లి గ్రామానికి చెందిన నర్సింలు సొంత ఖర్చుతో ఇసుక, కంకర, సిమెంటుతోలించి పూడ్పించారు.

పాత వంతెనల వద్ద... జర భద్రం!

ఏళ్లుగా మరమ్మతులు కరవు



అన్నాసాగర్- చింతకుంట దారిలో పిట్టగోడలు కూలిన వంతెన

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సదాశివపేట, జోగిపేట: జిల్లాలోని పలు ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల్లోని వారధులు ప్రమాదకరంగా మారాయి. ఆ దారుల గుండా వెళ్లాలంటే ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. ఏళ్లనాటి వంతెనలు కావడం వల్ల శిథిలావస్థకు చేరాయి. వాటికి శాశ్వతంగా మరమ్మతులు చేపట్టాలని చోదకులు, సమీప గ్రామవాసులు కోరుతున్నారు. సదాశివపేట మండలంలోని పలు గ్రామాల్లోని దారులపై వంతెనలు దెబ్బతినడంతో ప్రమాదకరంగా మారాయి. అధికారులు సకాలంలో మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల మరింత దెబ్బతింటున్నాయి. బాబిల్‌గాం గ్రామానికి వెళ్లే దారిలోని వంతెన గోడ కూలిపోయింది. రాత్రిపూట ద్విచక్రవాహనదారులు ఇక్కడ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఏడాది కిందట ఓ ద్విచక్రవాహనదారుడు వంతెన నుంచి గుంతలో పడిపోగా మృతిచెందాడు. వికారాబాద్ దారి నుంచి సిద్దాపూర్ వెళ్లే ప్రాంతంలోని కల్వర్టు మధ్యనలో రంధ్రం పడి ప్రమాదకరంగా మారింది. కోనాపూర్ నుంచి నాగుపల్లి వెళ్లే దారిలోని వాగుపై వంతెన రోజురోజుకు దెబ్బతింటుంది.

భయాందోళనలో ప్రజలు

అందోలు మండలం పరిధిలోని పలు ప్రాంతాల్లో బ్రిడ్జిలు ప్రమాదకరంగా మారాయి. అన్నాసాగర్ చింతకుంట గ్రామాల మధ్యన ప్రధాన దారి మధ్యలో నిర్మించిన బ్రిడ్జి కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దీనికి సంబంధించి ఇరువైపుల ఉన్న పిట్ట గోడలు కూలిపోయాయి. దీనిపై ఎదురెదురుగా వాహనాలు వస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. గతంలో ఓ ద్విచక్ర వాహనదారుడు అదే బ్రిడ్జీ పైనుంచి 8 అడుగుల లోతుగా పడటంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పలుమార్లు పశువులు పడి గాయాలైన ఘటనలు జరిగాయి. అయినా ఇప్పటివరకు దానికి పిట్టగోడ నిర్మాణం చేయలేదు. అన్నాసాగర్ దిగువ ప్రాంతంలోని అలుగు నీరు వెళ్లేందుకు నిర్మించిన బ్రిడ్జి పిట్టగోడలు శిథిలమయ్యాయి. గతంలో పలు వాహనదారులు ఆ గోడలు ఢీకొనడంతో కొంతభాగం కూలిపోయింది. ఇదే గ్రామ శివారులోని వైజంక్షన్ వద్ద ఉన్న బ్రిడ్జి పిట్టగోడకు పగుళ్లు వచ్చాయి. నారాయణఖేడ్ నుంచి వచ్చే వాహనదారులకు ఇక్కడ ప్రమాదం పొంచి ఉంది. గతంలో ఇదే ప్రాంతంలో ఓ లారీ అదుపుతప్పి గోడను ఢీకొన్న ఘటనలో ప్రాణనష్టం జరకపోయినా.. ఆస్తినష్టం తీవ్రమైంది. సాయిబాన్‌పేట లోలెవల్ బ్రిడ్జి, మాసానిపల్లి, డాకూరు, నేరడిగుంట తదితర గ్రామాల్లోని బ్రిడ్జిలదీ ఇదే పరిస్థితి.

వెంటనే మరమ్మతులు చేయిస్తాం

జిల్లాలో ఏళ్లనాటి రహదారుల వెంట ఉన్న వంతెనలకు మరమ్మతులు చేయిస్తాం. ఇప్పటికే వాటిని గుర్తించాం. నిధుల కోసం ప్రభుత్వానికి అంచనాలు రూపొందించాం. మంజూరవగానే టెండర్లు పిలిచి పనులు చేసేలా చర్యలు తీసుకుంటాం. **- జగదీశ్వర్, పీఆర్ ఎస్ఈ, రాంబాబు, ఆర్అండ్‌బీ శాఖ ఈఈ, సంగారెడ్డి.**